సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



హోటల్ రూంలకు డిమాండ్

సంక్రాంతి పండుగకు జిల్లాలో ఉండటానికి హోటళ్లను ముందుగానే బుక్ చేసుకుంటారు. దీంతో చిన్న, పెద్ద లాడ్జిలు బిజీగానే ఉంటున్నాయి. 8లో ▸



చీకటి పడితే తవ్వకాలే

చీకటి పడితే చాలు పోలవరం కుడి కాలువ గట్టుపై మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఒక చోటా నాయకుడి కనుసన్నల్లో ఇదంతా సాగుతోంది. 8లో ▸



మూసేవరకూ పోరాడతాం

తేతలిలో నిర్వహిస్తున్న పశువధ కర్మాగారాన్ని మూసే వరకు పోరాటం ఆపేదిలేదని గోసేవా సమితి సభ్యులు స్పష్టం చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

రెవెన్యూ అధికారుల సర్వే



కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: కన్నాపురంలో చెట్లు నరికివేతపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. 28న సాక్షిలో ప్రచురితమైన 'చెట్లు నరకవద్దంటూ గ్రామస్తుల ఆందోళన' శీర్షికకు స్పందించిన ఉన్నతాధికారులు సమగ్ర సర్వే చేపట్టాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది యర్రాయిగూడెం రోడ్డులో నరికి వేతకు గురైన చెట్లను పరిశీలించి భూఆక్రమణలకు సంబంధించిన అంశంపై గ్రామస్తుల ఆరోపణ మేరకు సర్వే చేశారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులు పుంత రోడ్డును ఆక్రమించారని అదేవిధంగా స్మశాన వాటికకు వెళ్లే దారిని కూడా ఆక్రమించారంటూ అధికారుల వద్ద ఫిర్యాదు చేశారు. పూర్తి సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వీఆర్‌వో సుబ్బారావు పేర్కొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు కుట్ర

అత్తిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో అనేక సాకులు చూపించి ఏరివేసేందుకు కుట్ర చేస్తుందని వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంపద సృష్టిలో భాగంగా దివ్యాంగుల కడుపు కొట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేయడం సిగ్గుచేటన్నారు. జనవరి నుంచి మే వరకు పింఛన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ నెపంతో సదరం సర్టిఫికెట్లు జారీ నిలుపుదల చేయనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించడం దారుణమన్నారు. సదరం సర్టిఫికెట్ జారీ నిలుపుదల వల్ల దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారని, ఐదు నెలలు పాటు జారీ నిలుపుదల చేశారని, ఈ నేపథ్యంలో పింఛన్ల మంజూరు ఎప్పటికి చేస్తారోనని దివ్యాంగులు ఆందోళనకు గురవుతున్నారని సుజన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో బూటకపు హామీలు, తప్పుడు ప్రచారాలు చేసి ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టి ఇప్పుడు ప్రజల్ని దారుణంగా మోసం చేయడమే గాక అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందని, ఫీజులు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలో నెట్టిందని సుజన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేసారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తల్ని అన్ని విధాలా ప్రోత్సహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన 16వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని ఆదేశించారు. సింగిల్ విండో పోర్టల్‌లో సెప్టెంబర్ 13 నుంచి డిసెంబర్ 26 వరకు పారిశ్రామికవేత్తల నుంచి 129 దరఖాస్తులకు స్వీకరించగా, వాటిలో 126 దరఖాస్తులు ఆమోదించామన్నారు. పీఎంఈజీపి పథకంలో రుణాల మంజూరుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి 211 దరఖాస్తులను స్వీకరించామని, వంద దరఖాస్తులను ఆమోదించగా 53 ఇప్పటికే గ్రౌండింగ్ అయ్యాయని చెప్పారు. లబ్ధిదారులు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు పారిశ్రామికవేత్తలతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని సేఫ్టీ కమిటీ అధికారులను ఆదేశించారు.

పోలీస్ కానిస్టేబుల్ ఎంపికలు ప్రారంభం

ఏలూరు టౌన్: పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించి తుది ఎంపికలకు రంగం సిద్ధం చేశారు. గతంలో ఎంపికల్లో ప్రాథమిక రాత పరీక్షలు పూర్తి చేయగా... తాజాగా దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఏర్పాట్లను శనివారం రాత్రి పర్యవేక్షించారు. ఈ నెల 30 నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దేహదారుఢ్య పరీక్షలు జనవరి 9 వరకూ కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరిలో 4,976 మంది అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు మంజూరు చేశామని తెలిపారు.

ఆకలి తీర్చే దోసెడు బియ్యం

నెలలో మూడో మంగళవారం వస్తే.. ఆ కాలేజీలో భుజాన పుస్తకాల బ్యాగే కాదు..
ప్రతి విద్యార్థి చేతిలో బాక్సు నిండా ఇంటి నుంచి బియ్యం నింపుకొని కాలేజీకి తెస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన డ్రమ్‌లో పోస్తారు. వచ్చిన బియ్యం మొత్తాన్ని మూడు నుంచి ఐదు కేజీల చొప్పున ప్యాకెట్లుగా చేసి వాటిని పేదలకు అందజేస్తారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరంలోని శ్రీ చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు హ్యాండ్ ఫుల్ ఆఫ్ రైస్ (దోసెడు బియ్యం) పేరిట గత రెండున్నరేళ్లుగా నిరాటంకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



- గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినూత్న సేవా కార్యక్రమం
- ప్రతినెలా 3వ మంగళవారం విద్యార్థుల నుంచి బియ్యం సేకరణ
- ప్రతి నెలా వంద నుంచి 120 కేజీల వరకు సేకరణ
- 5 కేజీల చొప్పున ప్యాకింగ్ చేసి పేదలకు అందజేస్తున్న విద్యార్థులు
- రెండున్నరేళ్లుగా నిరాటంకంగా నిర్వహణ

సండే స్పెషల్



గణపవరంలోని ఎస్‌సీహెచ్‌వీపీఆర్ కళాశాలలో దోసెడు బియ్యం కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు(ఫైల్)

సాక్షి, భీమవరం : విద్యార్థుల్లో సేవా దృక్పథం, మానవత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ దోసెడు బియ్యం విధానానికి శ్రీకారం చుట్టారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉండగా వాటిలో 300 మంది విద్యాభ్యాసం సాగిస్తున్నారు. విద్యతో పాటు ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌క్రాస్ సంబంధిత సేవా కార్యక్రమాల నిర్వహణకు ఇక్కడి అధ్యాపక బృందం, విద్యార్థులు ప్రాధాన్యమిస్తుంటారు. మనం తీసుకునే ఆహారంలో కొంచెం ఇతరులకు ఇవ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రతి విద్యార్థి నెలలో ఒక రోజున తమ ఇంటి నుంచి గుప్పెడు బియ్యాన్ని తెచ్చి కళాశాలలో ఏర్పాటుచేసిన డ్రమ్‌లో వేస్తారు. సేకరించిన మొత్తాన్ని నిరుపేదలకు అందించాలి. ప్రతినెలా మూడో మంగళవారం క్రమం తప్పకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

బ్యాగులుగా చేసి పేదలకు పంపిణీ

ఏదైనా నెలలో ఆరోజు సెలవు వస్తే ముందురోజున లేదా మరుసటి రోజున అమలు చేస్తున్నారు. నెలకు దాదాపు 100 నుంచి 120 కేజీల వరకు బియ్యం వస్తుండగా, వాటిని మూడు నుంచి ఐదు కేజీల వరకు బ్యాగులుగా ప్యాక్ చేసి గ్రామంలోని మార్కెట్ తదితర ప్రాంతాల్లోని నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నిర్మలకుమారి నేతృత్వంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, కామర్స్, బోటనీ లెక్చరర్లు బి.రాణిదుర్గ, డాక్టర్ సీహెచ్ చైతన్యల పర్యవేక్షణలో రెండున్నరేళ్లుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మూడో మంగళవారం వచ్చిందంటే చాలు తమకంటే ముందే తమ పేరెంట్స్ బాక్సులో బియ్యం నింపి తమకు ఇస్తారని, వారు ఈ సేవలో భాగస్వాములయ్యారని విద్యార్థులు చెబుతున్నారు. మిగిలినచోట్ల విద్యార్థులు ప్రయత్నిస్తే ఇది పెద్ద సేవగా మారుతుందని వారు ఆశిస్తున్నారు.

నాకైతే ఆనందంగా ఉంది



ప్రతినెలా విద్యార్థులు బియ్యం తెచ్చి పేదలకు పంచడం చాలా ఆనందంగా అనిపిస్తోంది. ఈ హ్యాండ్ ఫుల్ ఆఫ్ రైస్ ప్రోగ్రాం మరింత విస్తరించి ప్రతి ఒక్కరూ ఇతరులకు సేవ చేయటంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను.

– పి.హర్షిత, బీకాం సెకండియర్



సేకరించిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

పంచే గుణం పెంచేందుకు..



తమకు ఉన్న దానిలో ఇతరులకు కొంచెం పంచే గుణాన్ని విద్యార్థులకు అలవాటు చేయడం హ్యాండ్ ఫుల్ ఆఫ్ రైస్ ముఖ్య ఉద్దేశం. మా కళాశాలలో ప్రిన్సిపల్ నిర్మలకుమారి మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న అత్యుత్తమ సేవా కార్యక్రమాల్లో ఇది ఒకటి.

– డాక్టర్ సీహెచ్ చైతన్య, బోటనీ లెక్చరర్

తల్లిదండ్రులే ముందుంటారు



నెలలో మూడో మంగళవారం వచ్చిందంటే చాలు కాలేజీకి బియ్యం తీసుకువెళ్లాలి ఇవిగో అంటూ బాక్సులో పోసి పేరెంట్స్ పంపిస్తుంటారు. మా స్టూడెంట్సే కాదు మా పేరెంట్స్ కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు.

– కె.జాయ్, బీకాం కంప్యూటర్స్, సెకండియర్

మార్పు కోసం చిన్న ప్రయత్నం



ఇది కేవలం ఒక సామాజిక సేవా కార్యక్రమం కాదు. పేదరికాన్ని తగ్గించేందుకు, మానవత్వాన్ని పెంచేందుకు, సమాజంలో మార్పు కోసం మా విద్యార్థులు చేస్తున్న చిన్న ప్రయత్నం. ఈ కార్యక్రమం నిర్వహించే బాధ్యత నాకు అప్పగించడం ఆనందంగా ఉంది.

– బి.రాణి దుర్గ, కామర్స్ లెక్చరర్

విద్యతో పాటు విలువలు



మా కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారిలో విలువలు పెంపొందించాలన్నదే మా లక్ష్యం. పేదవారి ఆకలిని తీర్చడంలో ఉండే సంతృప్తిని వారు ఆనందిస్తున్నారు. ప్రతినెలా అందరూ ఎంతో ఉత్సాహంగా హ్యాండ్ ఫుల్ ఆఫ్ రైస్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

– డాక్టర్ పి.నిర్మలాకుమారి, ప్రిన్సిపల్

ప్రభుత్వ ఒత్తిడితోనే మాంసం ఎగుమతులు పెంచాం

లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ జీఎం అరవింద్ నరీన్



తణుకులో మాట్లాడుతున్న లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ జీఎం

తణుకు అర్బన్: ప్రభుత్వ ఒత్తిడితోనే ఇటీవల గేదె మాంసం ఎగుమతులు పెంచామని లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజరు అరవింద్ నరీన్ అన్నారు. శనివారం తణుకు చిట్టూరి హెరిటేజ్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ ఏర్పాటుకు 2014- 18లో తేతలి పరిధిలో అనుమతులు పొందామని, ఫ్యాక్టరీ నిర్మాణంతోపాటు అవసరమైన సామగ్రిని ఏర్పాటుచేసుకున్నామని చెప్పారు. ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం తమకు వచ్చే రెవెన్యూతోపాటు స్థానికంగా ఉపాధి పెంచాలనే ఉద్దేశంతో తమ తీవ్ర ఒత్తిడి చేస్తుందని, అందువల్ల మాంసం ఎగుమతులకు కావాల్సిన గేదెలను సమకూర్చుకుంటున్నట్లు చెప్పారు. పంచాయతీ అనుమతులు, స్థానికంగా వచ్చే సమస్యలతో తమకు అవసరంలేదని.. ఫ్యాక్టరీ నిర్మించే సమయానికి ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు లేవని స్పష్టం చేశారు. అన్ని విభాగాలకు సంబంధించి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతోనే తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుందని.. ఎవరు ఇబ్బంది పెట్టాలని చూసినా లీగల్‌గా వ్యవహరిస్తామని సంస్థ మూసే ప్రసక్తేలేదని అన్నారు.

30న పదోన్నతులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థతో పాటు వివిధ పురపాలక పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌లో పదోన్నతులు కల్పించడానికి సంబంధించిన సీనియారిటీ జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జాబితాలో ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం ఏలూరు విద్యాశాఖాధికారి కార్యాలయానికి ఈ నెల 30న రావాలని సూచించారు. సదరు ఉపాధ్యాయులు ఉదయం 9 గంటల లోపు సంబంధిత సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో హాజరు కావాలని సూచించారు.

గిన్నీస్‌లోకి.. గుడ్ మార్నింగ్ భీమవరం



గిన్నీస్ రికార్డు సర్టిఫికెట్‌తో విష్ణు విద్యార్థినులు(ఫైల్)

- తెలుగు రాష్ట్రాల్లో విద్యపై తొలి రేడియో స్టేషన్
- రోజూ భీమవరం ప్రాంత ప్రజలకు ఉపయోగకర సమాచారం
- రేడియో జాకీలుగా అలరిస్తున్న విద్యార్థినిలు
- 17 ఏళ్లుగా కమ్యూనిటీ రేడియో నిర్వహణ
- గిన్నీస్ ఘనత సాధించిన రేడియో విష్ణు 90.4

సాక్షి, భీమవరం : గుడ్ మార్నింగ్.. అంటూ భీమవరం పరిసర ప్రాంత వాసులను రోజూ పలకరించే ఎఫ్‌ఎం చానల్ రేడియో విష్ణు **90.4. గత 17 ఏళ్లుగా ఈ కమ్యూనిటీ రేడియో ఈ ప్రాంత వాసులకు విజ్ఞానం, వినోదం పంచుతుంది. 'ఇది** విజ్ఞాన వికాస వినోదాల సంగమం..' అంటూ విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, వ్యాపారం, ఉపాధి, వాతావరణం.. ఇలా ప్రజాపయోగ సమగ్ర సమాచారాన్ని శ్రావ్యమైన గొంతుతో రేడియో జాకీలు అందిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇందులో వ్యాఖ్యాతలుగా పట్టణంలోని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులే వినూత్న సమాచారంతో అలరిస్తుంటారు.

విద్యపై తొలి ఎఫ్‌ఎం స్టేషన్

విద్యార్థుల్లో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, డిబేటింగ్ ఎబిలిటీస్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ పెంపొందించేందుకు క్యాంపస్‌లో చైర్మన్ కేవీ విష్ణురాజు 2007లో రేడియో విష్ణు ప్రారంభించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విద్య, చర్చ ఆధారిత తొలి రేడియో స్టేషన్‌గా ఈ కమ్యూనిటీ రేడియో గుర్తింపు పొందింది. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రసారాలు అందిస్తున్నారు. నీరాజనం, రైతు నేస్తం, ఆయుష్మాన్‌భవ, గుడ్‌మార్నింగ్ భీమవరం, విజేతలు, సరదాగా కాసేపు, మహిళ, ఆణిముత్యాలు, కెరీర్ చాయిస్, స్టూడెంట్ టాక్ తదితర ప్రోగ్రాంలు ఆధ్యాత్మికం, విద్య, విజ్ఞానం, వినోదం, ఆరోగ్యం, వ్యవసాయ సమాచారాన్ని ప్రజలకు అందిస్తూ సమాజాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి.



రేడియో జాకీ

15 కిలోమీటర్ల పరిధిలో సేవలు

రేడియో జాకీలుగా అధికశాతం విద్యార్థినులే తమ శ్రావ్యమైన గొంతుతో శ్రోతలను అలరిస్తున్నారు. రేడియో స్టేషన్‌కు చుట్టుపక్కల 15 కిలోమీటర్ల పరిధిలోని భీమవరం పట్టణం, పరిసర గ్రామాల ప్రజలకు ఈ రేడియో సేవలు అందుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో శ్రోతలు వినేందుకు గ్లోబల్ యాక్సెస్‌ను అనుమతించే ఐఓఎస్, ఆండ్రాయిడ్ యాప్‌లు ఈ రేడియో స్టేషన్ నిర్వహిస్తోంది. ఉత్తమ ప్రసారాలకు 2014లో కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ కమ్యూనిటీ రేడియో, 2019లో యూనిసెఫ్ నుంచి బెస్ట్ కమ్యూనిటీ రేడియో, కోవిడ్ సమయంలో ఎంసెట్‌పై ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి విశ్వకర్మ అవార్డులు దక్కించుకుంది.

వంద మందితో గిన్నీస్ రికార్డు

ఇంతవరకు సుదీర్ఘ రేడియో ప్రసారం 66 గంటల 6 నిముషాల 1 సెకనుగా నార్త్ ఆఫ్రికాలోని ట్యునీషియా పేరిట గిన్నీస్ రికార్డు ఉంది. దీనిని తిరగరాయడం లక్ష్యంగా క్యాంపస్ లోని రెండొందల మంది విద్యార్థులకు మెంటల్ కేర్ అండ్ సెల్ఫ్ కేర్, ఛేంజ్ ఇన్ లైఫ్, ఎడ్యుకేషన్ ఆఫ్ గర్ల్ చైల్డ్, లైఫ్ ఆఫ్ ఏ గర్ల్, ఈ-కామర్స్, ఫుడ్ తదితర వంద అంశాలపై రెండు వారాల పాటు ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 2022 డిసెంబరు 7 నుంచి 10 వరకు 72 గంటల 30 నిముషాల 30 సెకన్ల పాటు వంద మంది విద్యార్థులు ఆయా అంశాలపై అనర్గళంగా 'లాంగెస్ట్ రేడియో ప్లే బ్రాడ్‌కాస్టింగ్ కంటిన్యూస్లీ' నిర్వహించి రికార్డు నెలకొల్పారు. ఒక్కొక్కరు 30 నిముషాల నుంచి గంట పాటు వినసొంపుగా తమ ప్రసంగాన్ని అందించారు. మధ్యలో విద్యార్థి మారేందుకు ఉన్న గడువు కేవలం 30 సెకన్లు మాత్రమే. పగలు, రాత్రితో నిమిత్తం లేకుండా మూడు రోజుల పాటు నిరంతరాయంగా ఈ ప్రక్రియ సాగింది. ఈ రికార్డు సాధనలో పాల్గొన్న వంద మంది రేడియో జాకీల్లో 90 మందికి పైగా విద్యార్థినులే **ఉన్నారు. గిన్నీస్ సర్టిఫికెట్ ఇటీవల కళాశాలకు చేరింది.**



రేడియో జాకీ

ఎప్పటికప్పుడు అప్‌డేట్



మా రేడియో ప్రసారాల ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తుంటాం. ఎప్పటికప్పుడు వివిధ రంగాల్లో వస్తున్న మార్పుల గురించి వివరిస్తాం. సాగు పద్ధతులు, వాతావరణ సమాచారాన్ని రైతులకు తెలియజేస్తుంటాం.

– కీర్తి గాయత్రి, బీటెక్ ఫైనల్ ఇయర్

ప్రజోపయోగ అంశాలకే ప్రాధాన్యం



ప్రజోపయోగ అంశాలే ప్రాధాన్యతగా మా రేడియో ప్రసారాలు ఉంటాయి. ప్రజలకు తెలియజేసేందుకు ప్రతీరోజూ మేము కొత్త విషయాలు తెలుసుకుంటుంటాం. ప్రసారాల ద్వారా గిన్నీస్ రికార్డు నెలకొల్పడం ఆనందంగా ఉంది.

– కె.కృష్ణసాయి, బీటెక్ నాలుగో సంవత్సరం

కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంచడమే లక్ష్యం



రేడియో విష్ణు నిర్వహణలో విద్యార్థులదే కీలకపాత్ర. రేడియో జాకీల్లో అధికశాతం మంది విద్యార్థినిలే ఉన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు రేడియో ఎంతో దోహదపడుతోంది.

– డాక్టర్ జి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్

ఎస్సీలంతా ఐక్యతతో సాగాలి



ఎంపీ గొల్ల బాబూరావును సత్కరిస్తున్న ఎస్సీ నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నేటికీ ఎస్సీలు వివక్షత ఎదుర్కొంటున్నారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో ఎస్సీల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు బాబూరావును కొనియాడారు. ఏలూరుకు సమీపంలోని కొవ్వలిలో పేద కుటుంబంలో జన్మించిన బాబూరావు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకున్నారంటూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ దళితులను విభజించి వారి అవసరాలను తీర్చుకుంటున్నారన్నారు. దళితులంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో దళితుల ఐకమత్యం కోసం చేపట్టే ఉద్యమాన్ని ఏలూరు కేంద్రంగానే ప్రారంభిద్దామంటూ పిలుపు నిచ్చారు. తనకు మాలలు-మాదిగలు రెండు కళ్లు లాంటి వారని గుర్తు చేసారు. రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి చాగంటి సంజీవ కుమార్, ఊదర గొండి చంద్రమౌళి, పల్లెం ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్, సర్పంచ్‌లు పాము మాన్ సింగ్, బోదుల స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ రూమ్‌లకు భలే డిమాండ్

- సంక్రాంతికి ముందుగానే రూమ్‌ల బుకింగ్
- కోడి పందాలు తిలకించడానికి వచ్చేవారు, పందెంరాయుళ్లతో బిజీ
- పండుగ నాలుగు రోజుల్లో రూ.60 నుంచి 70 లక్షల వ్యాపారం

భీమవరం (ప్రకాశం చౌక్) : ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు జిల్లాకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి జనం భారీగా తరలి వస్తారు. ఇక్కడ జరిగే పండుగ సంబరాలతోపాటు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో జరిగే కోడి పందాలు తిలకించడానికి, కోడి పందాలు కాసేందుకు పందెంరాయుళ్ల పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. దీంతో పండుగ నాలుగు రోజులు జిల్లాలో ఉండటానికి హోటళ్లను ముందుగానే బుక్ చేసుకుంటారు. పండుగ సమయంలో హోటళ్ల రూమ్‌లు దొరకడం కష్టతరమవుతుంది. హోటల్ రూమ్ కోసం ఎంత రేటు అయినా పెట్టడానికి వెనుకాడరు. దీంతో చిన్న, పెద్ద లాడ్జిలు సైతం బిజీగానే ఉంటాయి. కొందరు విడిది ఇల్లులు, కళ్యాణ మండపాల్లోని రూమ్‌లను సైతం సంక్రాంతికి బుక్ చేసుకుంటారు.

రెండు నెలల ముందే అడ్వాన్స్ బుకింగ్

సంక్రాంతి పండగకు ప్రతి ఏడాది రెండు నెలల ముందే జిల్లాలోని హోటల్స్, లాడ్జిల్లో రూమ్‌లు బుక్ చేసుకుంటారు. ఈ ఏడాది కూడా అదే మాదిరిగానే నవంబరు నుంచే జిల్లాలోని హోటల్స్ రూమ్‌లు బుకింగ్ అయిపోయాయి. పెద్ద హోటళ్లలో రూమ్‌లు మొత్తం అడ్వాన్స్ బుకింగ్ కాగా లాడ్జిల్లో రూమ్‌లు సైతం 90 శాతం మేర బుకింగ్ పూర్తయ్యింది. జిల్లాలో భీమవరం తర్వాత తణుకు, పాలకొల్లు, నర్సాపురం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో జోరుగా కోడి పందాలు నిర్వహిస్తారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, లాడ్జిలు బిజీగానే ఉంటాయి.

రూమ్ ప్యాకేజీ రూ.25 వేల నుంచి రూ.35 వేలు

సంక్రాంతి కోడి పందాల్లో భీమవరం వెరీ ఫేమస్. దీంతో ఇక్కడి హోటళ్లు, లాడ్జిలకు యమ డిమాండ్. పట్టణంలో ఐదు పెద్ద హోటళ్లు, రెండు క్లబ్‌లు, టౌన్ హాల్, 25 లాడ్జిలు వరకు ఉన్నాయి. హోటళ్లు, లాడ్జిల్లో పండగ నాలుగు రోజుల ప్యాకేజీ రూ.25 వేలు నుంచి రూ.35 వేలు వరకు ఉంది. రూమ్ రకాలు, టిఫిన్స్, స్నాక్స్ ఇతర సౌకర్యాలు బట్టి నాలుగు రోజుల ప్యాకేజీ గరిష్టం రూ 35 వేలు ఉంది.

ప్రముఖులకు లగ్జరీ రూమ్స్

సంక్రాంతి కోడి పందాలకు రాజకీయ నేతలతో పాటు సినీ నటులు సైతం తరలివస్తుంటారు. వారి కోసం ఇప్పటికే వారి సమీప బంధువులు, స్నేహితులు భీమవరంలోని పెద్ద హోటళ్ల రూమ్‌లు ముందుగానే బుక్‌చేశారు. హోటళ్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు రాకుండా వారి వివరాలను హోటళ్ల యాజమాన్యం గోప్యంగా ఉంచింది.



భీమవరంలో లాడ్జి

నాలుగు రోజులకే రూ.70 లక్షల వరకూ వ్యాపారం

జిల్లా వ్యాప్తంగా పెద్ద హోటళ్లు 20, సాధారణ హోటళ్లు 25, లాడ్జిలు 20 వరకు ఉన్నాయి. సంక్రాంతి పండగకు హోటళ్లు, లాడ్జిలపై ప్రతి ఏడాది రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వ్యాపారం జరుగుతుంది. సాధారణ రోజుల్లో నెలకి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. ఈ సంక్రాంతికి భీమవరంలో ఇప్పటికే రూమ్‌లపై రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో హోటళ్లతో పొల్చుకుంటే 50 శాతం వ్యాపారం భీమవరంలోనే జరుగుతుంది.



భీమవరంలోని హోటల్

రెండు నెలల ముందే రూమ్‌లు బుకింగ్



ప్రతి ఏడాది సంక్రాంతికి రెండు నెలల ముందే రూమ్‌లు బుక్ చేసుకుంటారు. ఇప్పటికే మా హోటల్‌లోని రూమ్‌ల బుకింగ్ పూర్తయింది. ఇతర ప్రాంతాల నుంచి రూమ్‌ల కోసం ఫోన్లు చేస్తున్నా లేవు అని చెబుతున్నాం. సంక్రాంతి పండుగకి హోటల్స్, లాడ్జిలకు మంచి గిరాకీ ఉంటుంది.

– ఎస్.పవన్‌కుమార్, హోటల్ ఆనంద ఇన్ మేనేజర్, భీమవరం

క్లుప్తంగా

ఆలోచనాశక్తి పెంపునకు 'బాలోత్సవం' దోహదం



బాలోత్సవంలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

భీమవరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుగాకుండా, మూఢనమ్మకాలు వైపు పోకుండా వారిలో ఆలోచనాశక్తిని పెంపొందించేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ చింతలపాటి బాపిరాజు మెమోరియల్ (ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్) హైస్కూల్‌లో శనివారం బాలోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, మెమరీ టెస్ట్, స్పెల్లింగ్ వంటి పోటీలు నిర్వహించారు. అలాగే విచిత్రవేషధారణ, ఏకపాత్రాభినయం, శాస్త్రీయ నృత్యం, అభ్యుదయ దేశభక్తి జానపద నృత్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం ప్రారంభంకాగా అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి, బాలోత్సవం ముఖ్య నిర్వాహకురాలు స్వరూప రాణి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

భీమవరం : రైలు ఢీకొని గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందాడు. భీమవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి. శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో విజయవాడ నుంచి భీమవరం వైపు వస్తున్న పాసింజర్ రైలు ఆకివీడు–భుజబలపట్నం మధ్య రైలు పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడిని ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటాయని, లుంగీ, గళ్లరంగు చొక్కా ధరించాడని, ఆచూకీ తెలిసినవారు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై పీటీపీ రమణ తెలిపారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగులబెట్టండి

సీపీఎం జిల్లా కమిటీ సమావేశం పిలుపు



సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఏ.రవి

ఏలూరు (టూటౌన్) : అన్ని గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో తగులబెట్టి నిరసన తెలపాలని సీపీఎం జిల్లా కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక పవర్ పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శనివారం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ ప్రజా ఉద్యమం చేపడతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలల్లో రూ.16 వేల కోట్ల అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమన్నారు. జనవరి నుంచి మళ్లీ యూనిట్‌కి 45 నుంచి 50 పైసలు మేర చార్జీలు పెంచబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అలాగే ముందస్తు నోటీసులు ఇవ్వకుండా బుట్టాయిగూడెంలో సీపీఐ కార్యాలయం కూల్చివేతను సమావేశం ఖండించింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ





ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శనివారం గోకుల తిరుమల పారిజాతగిరిలో గోదాదేవికి, దేవతామూర్తులకు సారె సమర్పించారు. వివిధ రకాలైన పండ్లు, పుష్పాలు, ఫలహారములు, నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులతో భక్త బృందం ఆలయం చుట్టూప్రదక్షణ చేసి ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించారు. తొలుత గోదాదేవికి శ్రీకృష్ణునికి విశేష అష్టోత్తర పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు, మంగళహారతి అనంతరం సారెలోని వినియోగించిన ద్రవ్యములను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు శ్యామలాంబ, సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

– జంగారెడ్డిగూడెం

కర్మాగారాన్ని మూసేవరకూ పోరాడతాం



తేతలిలో కర్మాగారం వద్ద నిరసన శిబిరంలో పాల్గొన్న గో సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు

తేతలిలో గో సేవా సమితి సభ్యులు

తణుకు అర్బన్: తేతలిలో నిర్వహిస్తున్న పశువధ కర్మాగారాన్ని గతంలో రెండుసార్లు తోకముడిచేలా చేశామని, ఈసారి కర్మాగారం మూసివేసే వరకు పోరాటం ఆపేదిలేదని గోసేవా సమితి సభ్యులు స్పష్టం చేశారు. తేతలిలోని లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కర్మాగారాన్ని మూసివేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరసన శిబిరం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా గో సేవా సమితి ప్రతినిధి కొండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒత్తిడి చేస్తేనే ఇటీవల కాలంలో మాంసం ఉత్పత్తులు పెంచామని సాక్షాత్తూ లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజరు విలేకరులతో చెప్పారని.. దీనికి స్థానిక ప్రజాప్రతినిధులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇటువంటి రక్తపాతం చేసే ఫ్యాక్టరీ ద్వారా వచ్చే రెవెన్యూపైనే ప్రభుత్వం నడవాలా అని నిలదీశారు. పశువధ నిర్వహిస్తున్న సంస్థ తమ వద్ద ఉన్న అనుమతులు సక్రమేమనని నిరూపిస్తే రూ. 5 లక్షలు నజరానా ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో గుడ్డిగా నడపవచ్చనే ఉద్దేశంతో అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని విమర్శించారు. పశువధ కర్మాగారంతో 2 లక్షల మంది తణుకువాసుల జీవనం కలుషితమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. అఘోరా అఖాడా జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్ నాథ్‌జీ అఘోరీ మాట్లాడుతూ అనుమతులు ఉన్నప్పుడు దొంగతనంగా నిర్వహించుకోవడం ఎందుకని ప్రశ్నించారు. అంత నిర్బంధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారంటే లోపల ఏదో జరుగుతుందనే అనుమానాలు ప్రజలకు వస్తున్నాయని స్పష్టం చేశారు. మన ఊరు, మన నేల, మన నీరు కలుషి తం కాకుండా ఉండాలంటే పశువధ కర్మాగారాన్ని పూర్తిగా తొలగించాలని, అందుకోసం ఎంతటి పోరాటనికైనా వెనుకాడేది లేదని అన్నారు. కార్యక్రమంలో తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీ, గోసేవా సమితి సభ్యులు జల్లూరి జగదీష్, కాకిలేటి రాజేంద్రప్రసాద్, గిరీశ్వరరావు, కరుటూరి పాండు రంగారావు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు

ఆగిరిపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాల ఆవరణలో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోకరాజు గంగరాజు మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. హీల్ పేరడైజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్, సీఈఓ అజయ్‌కుమార్, ఏషియన్ గేమ్స్ బంగారు పతకం గ్రహీత కల్యాణి పాల్గొన్నారు.

చీకటి పడితే తవ్వకాలే

యథేచ్ఛగా సాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు



ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం పోలవరం కుడి కాలువ గట్టుపై జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు

ద్వారకాతిరుమల: చీకటి పడితే చాలు పోలవరం కుడి కాలువ గట్టుపై మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం శివారు పోలవరం కుడి కాలువ గట్టుపై ఒక చోటా నాయకుడి కనుసన్నల్లో నిత్యం మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి అయితే చాలు ఈ అక్రమ దందా మొదలవుతోంది. పెద్ద నాయకుల అండదండలతోనే ఈ దందా సాగుతున్నట్టు తెలుస్తోంది. ఈ అక్రమ మట్టి తవ్వకాలను కొందరు గ్రామస్తులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. ఆ సమయంలో అక్రమార్కులు గ్రామస్తులపై గొడవకు దిగారు. అధికారంలో ఉన్న తమను అడ్డుకోవడానికి ఎంత ధైర్యమంటూ రెచ్చిపోయారు. గ్రామస్తులు సైతం వారికి దీటుగా సమాధానమిచ్చి, జేసీబీని నిలిపివేశారు. అయితే పోలీసులకు సమాచారం అందిన విషయం తెలుసుకున్న అక్రమార్కులు అక్కడి నుంచి జారుకుని, మళ్లీ శనివారం వేకువజామునే తమ దందాను మొదలు పెట్టారు. తమకు అండగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారని, ఎవరైనా అడ్డొస్తే వారి అంతు చూస్తామంటూ అక్రమార్కులు బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడు మృతి



ఘటనా స్థలంలో యువకుడి మృతదేహం

తణుకు అర్బన్: తణుకు మండలం దువ్వ గ్రామ జాతీయరహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం రాత్రి ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన మిరియాల అశోక్‌కుమార్ (21) ద్విచక్ర వాహనంపై తణుకు వస్తూ దువ్వ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టింది. దీంతో అశోక్‌కుమార్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అతడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి : ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన జరిపారు.

రెవెన్యూ సదస్సులకు 32 అర్జీలు



రెవెన్యూ సదస్సులో ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం, వీరంపాలెం గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బంగారుగూడెంలో 17, వీరంపాలెంలో 15 వెరసి 32 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. దాదాపు 49 రకాల సేవలను రెవెన్యూ సదస్సుల్లో ఉచితంగా పొందవచ్చన్నారు. ప్రజలు ఈ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుండ్రు తేజస్విని, వీఆర్వో రాజేష్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకుడు చుండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కె.పెంటపాడులో పౌరహక్కుల దినోత్సవం



కె. పెంటపాడులో మాట్లాడుతున్న మంగరాజు

పెంటపాడు: కె. పెంటపాడు సచివాలయం వద్ద శనివారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పెంటపాడు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ కులవివక్షకు గురి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గతం కన్నా జగనన్న సీఎం అయిన నాటి నుంచి ఎస్సీలకు ప్రత్యేక రక్షణ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పొట్ల ఏడుకొండలు, పెంటపాడు సాంఘీకసంక్షేమ అధికారి, పెంటపాడు పోలీసులతోపాటు, మండల వ్యవసాయాధికారి సారధి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసం శనివారం కావడంతో తెల్లవారు జాము నుండి ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

వేణుకు డాక్టరేట్



తణుకు అర్బన్: తణుకు ఎస్‌డీ కాలేజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంబీఏ డిపార్టుమెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వి.వేణుకు పీహెచ్‌డీ అవార్డు దక్కింది. మేనేజ్‌మెంట్ ఆఫ్ నాన్ పెర్‌ఫామింగ్ అసెట్స్ అనే అంశంలో పీహెచ్‌డీ చేసిన కారణంగా ఈ గౌరవం దక్కినట్లు వేణు వివరించారు. ఈ సందర్భంగా కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణితోపాటు జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్ వీవీవీ సత్యనారాయణరెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి కె.సురేష్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

పండుగ రోజుల్లోనూ వ్యాపారం నిల్

- క్రిస్మస్ వ్యాపారం జరగలేదు.. సంక్రాంతి వ్యాపారం ఇంకా లేదు
- ఖాళీగా దర్శనమిస్తున్న దుకాణాలు
- డబ్బులెక్కడివి అంటున్న ప్రజానీకం
- గతంలో ఎన్నడూ ఇటువంటి రోజులు చూడలేదంటున్న వ్యాపారులు



తణుకులో ఖాళీగా ఉన్న రెడీమేడ్ బట్టల దుకాణం



తణుకులో కొనుగోలుదారుల సందడి లేని ప్రధాన వస్త్ర దుకాణాలున్న వేల్పూరు రోడ్డు



తణుకులో రద్దీ లేని వస్త్ర, ఫ్యాన్సీ దుకాణాలకు పేరుగాంచిన ఆలమూరి వారి వీధి

తణుకు అర్బన్: హిందువులకు పెద్ద పండుగ సంక్రాంతి.. క్రైస్తవులకు పెద్ద పండుగ క్రిస్మస్.. అటువంటి పండుగ రోజుల్లో కూడా తణుకు మార్కెట్ నిశ్శబ్ద వాతావరణాన్ని సంతరించుకోవడం వ్యాపారులను ఆశ్చర్యపరుస్తోంది. క్రిస్మస్ పండుగకు పెద్దగా వ్యాపారం జరగకపోగా, సంక్రాంతి పండుగకి పదిహేను రోజులు మాత్రమే ఉన్నప్పటికీ మార్కెట్‌లో దుకాణాలన్నీ ఖాళీగా ఉండడం వ్యాపారులకు మింగుడుపడడంలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి వ్యాపారాలు లేక విలవిలలాడుతన్న వ్యాపారరంగం, పండుగ వ్యాపారం అయినా జరుగుతుందని భారీగా పెట్టుబడి పెట్టుకుని సరుకు పెట్టుకుంటే కనీస వ్యాపారం కూడా జరగడంలేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఇటువంటి కరువు రోజులు గతంలో ఎన్నడూ చూడలేదని ఎలా గట్టెక్కేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగ అంటేనే ముఖ్యంగా వస్త్ర, రెడీమేడ్ వ్యాపార దుకాణాలు. గతంలో నెలరోజుల ముందునుంచే దుకాణాలు కిక్కిరిసిపోయే వ్యాపారాలు నేడు ఇంకా బోణీ కాని రోజులు నడుస్తున్నాయంటే వ్యాపారం ఏరకంగా పడిపోయిందోనని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ అనంతరం తణుకులో కొన్ని ప్రధాన దుకాణాలు సైతం మూతపడేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యాపారులే చెబుతున్నారు.

వస్త్రవ్యాపారానికి తణుకు

వస్త్ర వ్యాపారానికి పేరెన్నికగన్న తణుకు పట్టణం ఎంతో పేరుగాంచింది. పట్టణ ప్రాంతవాసులతో పాటు చుట్టుపక్కల వంద గ్రామాల నుంచి సైతం ప్రజలు తణుకులోఉన్న వస్త్ర దుకాణాలకు వచ్చి బట్టలు తమకు ఇష్టమైన వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే నగరాల్లో పేరుగాంచిన భారీ వ్యాపార సంస్థలు సైతం తణుకులో బహుల అంతస్థుల భవనాల్లో ఏర్పాటు చేసిన షోరూంలు గతం నుంచి అందుబాటులో ఉన్నాయి. ఇక రెడీమేడ్ దుస్తులు సైతం బ్రాండెడ్ కంపెనీలు విక్రయించే పేరుగాంచిన షోరూంలు తణుకులో ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయి వ్యాపార రంగం కకావికలం కావడంతో దుకాణాలు మూతపడే స్థితికి వచ్చాయి. అయితే ఈ పండుగ సీజన్‌లో అయినా నాలుగు రూపాయిలు సంపాదించుకోవాలనే వ్యాపారులకు ఇప్పటివరకు వ్యాపారం జరగక షాక్ తింటున్నారు.

పండుగ రద్దీలేని ప్రధాన వీధులు

సంక్రాంతి పండుగకు ఇంకా పదిహేను రోజులు మాత్రమే ఉన్నా అధికసంఖ్యలో వస్త్ర, ఫ్యాన్సీ దుకాణాలున్న వీధులు సైతం ఇంకా నిర్మానుష్యంగానే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా తణుకు నరేంద్ర సెంటర్ నుంచి వేల్పూరు రోడ్డు తణుకు పట్టణ వస్త్ర వ్యాపారానికి గుండెకాయ లాంటిది. అటువంటి ప్రధాన వీధికి ఇంకా పండుగ సందడి రాలేదు. బాబు ఎంపోరియం వీధి, ఆలమూరి వారి వీధుల్లో వస్త్ర దుకాణాలతోపాటు మగువలు మెచ్చే ఫ్యాన్సీ, గాజులు, ఎంబ్రాయిడరీ, లేడీస్ డ్రెస్ మెటీరియల్ వంటి దుకాణాలు సైతం ఖాళీగానే ఉండడం వ్యాపారులకు మింగుడుపడని పరిస్థితి. బంగారు దుకాణాలు సైతం ఖాళీగా ఉండడం వ్యాపారులకు ఏం జరుగుతుందో అర్థం కావడంలేదు. పండుగ వ్యాపారాన్ని నమ్ముకుని దుకాణాల్లో పనిచేసే వర్కర్లకు జీతాలివ్వలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు.

సంక్షేమ నిధులతో సుభిక్షంగా వ్యాపార రంగం

గత ఐదేళ్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం రూపంలో అందజేసిన నగదు మార్కెట్‌లో చలామణి కావడంతో వ్యాపారరంగం విరాజిల్లిందని వ్యాపారులే చెబుతున్నారు. ప్రతి నెలా ఏదోక పథకం పేరుతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన సొమ్ముతో ప్రజానీకం వివిధ సామగ్రి కొనుగోలు చేయడంతో మార్కెట్‌లో డబ్బు మారకం జరిగేది. కానీ నేటి ఇబ్బందులు చూస్తుంటే ఆర్థికమాంధ్యం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయా అనే సందేహం కలుగుతోంది. గతంలో కోవిడ్ మహమ్మారి చిదిమేసినా సంక్షేమంతో వచ్చిన నగదుతో ప్రజల ఆర్థిక పరిస్థితిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు.

కోవిడ్‌లోనూ వ్యాపారం బాగుంది



మా 20 సంవత్సరాల వ్యాపార అనుభవంలో నేటి దుస్థితి ఎన్నడూ లేదు. ఇంత దారుణమైన కరువు రోజులు ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్కెట్‌లో నగదు మారకం సమస్యతోపాటు ఆన్‌లైన్ వ్యాపారం, మాల్స్ కూడా ఒక మాదిరి వ్యాపారాలను కుంగదీస్తున్నాయి. కోవిడ్ మహమ్మారితో ప్రజలు ఇబ్బందులు పడినప్పటికీ దుకాణాలు తెరచుకున్నాక తిరిగి వ్యాపారం పుంజుకుంది. కానీ నేడు ఆర్థిక మాంధ్యం ఏర్పడిందా అన్నట్లుగా వ్యాపారాలు జరగడం లేదు.

– జి.సుజాత, రెడీమేడ్ షాపు యజమాని

మద్యం వ్యాపారులకు 20 శాతం కమీషన్ ఇవ్వాలి



తణుకులో విలేకరులతో మాట్లాడుతున్న మద్యం వ్యాపారులు

తణుకు అర్బన్ : ప్రభుత్వం మద్యం దుకాణాల టెండరు ప్రక్రియకు ముందు 20 శాతం కమీషన్ ఇస్తుందని ప్రకటించడంతో వ్యాపారం బాగుటుందనే ఉద్ధేశ్యంతో మద్యం దుకాణాలకు టెండర్లు వేశామని కానీ నేడు 10 శాతం మాత్రమే కమిషన్ ఇస్తుండడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని మద్యం వ్యాపారి ఎం.దానారావు అన్నారు. తణుకులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తమకు 20 శాతం కమిషన్ ఇస్తేనే కానీ నష్టాల నుంచి బయట పడలేమని అన్నారు. మద్యం దుకాణాలు టెండరు ప్రక్రియ ప్రకారం తలొక దుకాణం వచ్చిందని మేమే ఆ దుకాణాలు నిర్వహించుకుంటున్నామని ఎటువంటి సిండికేటు లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మద్యం వ్యాపారులు పాల్గొన్నారు.

3న కలెక్టరేట్‌కు రావాలని రైతులకు నోటీసులు

ఆకివీడు: జాతీయరహదారి నంబర్ 165కు ఉప్పుటేరు వద్ద నుంచి అజ్జమూరు గరువు వరకూ బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణకు సంబంధించి రికార్డు దఖలపరిచేందుకు జనవరి 3న భీమవరం కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని సంబంధిత భూమి యజమానులకు నోటీసులు జారీ చేశారు.భూమి విలువల్లో తేడాలు వల్ల ఆయా ప్రాంతాల్లోని రైతులు కోర్టుకు వెళ్లడంతో కొంత జాప్యం జరిగింది. కోర్టు ఆదేశాల అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా భూమి యజమానులు, కొనుగోలుదారులు సుమారు 87 మందికి నోటీసులు జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పదవులు



మంగెన సూర్య



బోడపాటి వీర్రాజు



పైబోయిన సత్యనారాయణ



కొప్పిశెట్టి దుర్గాప్రసాద్

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తణుకు నియోజకవర్గంలోని మండలాలకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులుగా నియామకాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. తణుకు పట్టణ అధ్యక్షుడిగా మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షులుగా బోడపాటి వీర్రాజు, అత్తిలి మండల అధ్యక్షులుగా పైబోయిన సత్యనారాయణ, ఇరగవరం మండల అధ్యక్షులుగా కొప్పిశెట్టి దుర్గాప్రసాద్‌లు నియామకం అయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడిగా బుద్ధరాతి భరణిప్రసాద్, జనరల్ సెక్రటరీగా మల్లిరెడ్డి నాగార్జున, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా యిండుగపల్లి బలరామకృష్ణ, వెలగల అమ్మిరెడ్డి, సెక్రటరీ యాక్టివిటీలుగా కోట నాగేశ్వరరావు, పాలా సత్యనారాయ ణ, అధికార ప్రతినిధిగా కర్రి గంగాధర అప్పారావులను నియమించారు. వీరందరికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు అభినందనలు తెలిపారు. పదవులు పొందిన నాయకులు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సిఫార్సుచేసిన కారుమూరికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

అత్తిలి: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేసి మంచిపేరుతీసుకురావాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శాఖల వారీగా సంబంధిత శాఖల అధికారులు మండలంలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరించారు. సమావేశంలో సభ్యులు అడిగిన సందేహాలను ధికారులు నివృత్తి చేసారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రబీకి పూర్తిస్థాయిలో నీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సమావేశంలో సంతాపాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జడ్పీటీసీ అడ్డాల జానకి, ఎంపీడీవో పి శామ్యూల్, తహసీల్దార్ దశిక వంశీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ వంక పుట్టినరోజు వేడుకలు



తణుకులో కేకు కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పుట్టినరోజు వేడుకలు ఆయన నివాసంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ సతీమణి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఎం సహాయ నిధి పథకం కింది ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.4 లక్షల చెక్కును బాధితుల కుటుంబ సభ్యులకు శనివారం పట్టణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన వివిధ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

దాతల సేవలు అభినందనీయం



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయానికి శనివారం వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను దాతలు అందజేశారు. గ్రంధాలయంలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందే అభ్యర్థులకు ఉపయోగపడే సుమారు రూ.8,555 విలువకలిగిన గ్రూప్ -1, గ్రూప్-2, డీఎస్సీ, ఆర్ఆర్‌బి, కంప్యూటర్ బుక్స్‌ను దాతలు దాట్ల నవీన్ కుమార్‌వర్మ, కొత్తపల్లి రామకృష్ణంరాజు గ్రంథాలయాధికారిఎస్ వెంకటేశ్వర రావుకు అందజేశారు. డీవీ చంద్రాజీ అధ్యాత్మిక పుస్తకాలు అందించారు. మానవతా సేవా సంస్థ కోశాధికారి గ్రంధి కుమారవెంకటేశ్వరప్రసాద్, విజ్ఞాన వేదిక సేవాసంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, ఇందుకూరి శివాజీవర్మ,పాల్గొన్నారు.

గంపెడాశతో రబీ వరిసాగు



నాట్లు వేస్తున్న కూలీలు



దమ్ము చేస్తున్న రైతు

గ్రామాల్లో నాట్లు ప్రారంభం

ఇరగవరం : ఈ ఏడాది ఖరీఫ్‌లో గిట్టుబాటు కాని అన్నదాతలు గంపెడాశతో రబీ సాగుకు సన్నద్ధం అయ్యారు. ఖరీఫ్‌లో పంట దిగుబడులు ఎకరానికి 30నుంచి 35 బస్తాలు మాత్రమే వచ్చాయి. వాతావరణం అనుకూలిస్తే రబీలో ఎకరానికి 50నుంచి 60బస్తాల దిగుబడులు వస్తాయని రైతులు ధీమాగా చెబుతున్నారు. ప్రస్తుతం వారు ముమ్మరంగా రబీ సాగు పనులు చేపట్టారు. రబీ వరిసాగు పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమై ఉన్నారు. కొందరు పొలాలకు దమ్ములు చేస్తుంటే మరికొందరకు తౌరాలు వేస్తుండగా, ఇంకొందరు నాట్లు వేసే పనిలో ఉన్నారు. తణుకు డివిజన్ వ్యాప్తంగా రబీలో 28వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 2,980 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అంతేగాకుండా రబీ పంటకు ఎరువులుకూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

రబీలో పెట్టుబడులు

సాధారణంగా రబీలో వరిసాగుకు పెట్టుబడి ఎకరానికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకూ అవుతుంది. నీటి ఎద్దడి లేకుండా, వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు 50నుంచి 60బస్తాల వరకూ రావచ్చని రైతులు లెక్కలు వేస్తున్నారు. ఇదే జరిగితే తమకు ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను అధిగమించి లాభాల బాట పడతారని చెబుతున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 30శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఆకుమడులు తయారయ్యాయి. ఇలా ఆకుమడులు సిద్ధమైన చోట్ల రైతులు నాట్లు వేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

డివిజన్ వ్యాప్తంగా రబీ పంటకు 3600మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ప్రభుత్వం ఇప్పటికే 1200 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేసిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సొసైటీలు, మార్క్‌ఫెడ్ ద్వారా వాటిని రైతులకు సరఫరా చేయవలసి ఉంది. ఇప్పటికే ప్రతి సొసైటీ వద్దా ఎరువులు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

చురుగ్గా రబీ పనులు

తణుకు డివిజన్ వ్యాప్తంగా రబీ వరిసాగు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వరినాట్లు ముమ్మరంగా చేపట్టగా, నారుమడులు వేస్తున్నారు. డివిజన్ పరిధిలో 10శాతం నాట్లు పూర్తయ్యాయి. ఇరగవరం, తణుకు మండలాల్లో మాత్రం 30శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయి. రబీకి 3600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. మూడు ధపాలుగా వీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మొదటి విడతగా 1200 మెట్రిక్‌టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.

– రాఘువేంద్ర, మండల వ్యవసాయాధికారి

ఘనంగా స్త్రీల క్రిస్మస్ వేడుకలు



పెంటపాడు లూథరన్ చర్చి స్త్రీల క్రిస్మస్ వేడుకలలో గీతాలు ఆలపిస్తున్న సభ్యులు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు లూథరన్ చర్చిలో శనివారం సాయంత్రం స్త్రీల సమాజం ఆధ్వర్యంలో స్త్రీల క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అధ్యక్షురాలు ఎస్. సుజాత సునీల్, గురు మండల అధ్యక్షుడు ఎస్. సునీల్‌ల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గూడెం మసీదుసెంటర్‌కు చెందిన ప్రత్యేక ప్రసంగీకులు దోర్కారివైవల్, క్రీస్తు జనన వృత్తాంతానికి సంబంధించి ప్రసంగించారు. సంఘ సీఆర్ డి. పాల్, డెలిగేట్ శేఖర్‌బాబు, సహాయ గురుమండల అధ్యక్షుడు కాంతారావు, సీసీసీ సభ్యు లు సునీల్‌కుమార్ ,ప్రభువరం, సంఘ పెద్దలు దేవాబత్తుల శామ్యూల్‌రాజు, సీహెచ్ కిషోర్‌కుమార్, పద్మావతి, సునీత, స్త్రీల సమాజం భక్తులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ స్త్రీల సమాజసభ్యులకు ప్రత్యేక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

కరుణామయుని మార్గం అనుసరణీయం



తణుకు డంపింగ్ యార్డులో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: క్రీస్తు సర్వమానవాళికి చూపిన శాంతి మార్గంలో అందరూ నడవాలని తణుకు ఈఫీఎఫ్ అధ్యక్షుడు పి. మోజస్ ప్రవీణ్ తెలిపారు. ఈఫీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం డంపింగ్ యార్డు కార్మికుల వద్ద, ఉండ్రాజవరం రోడ్డు లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినెలా ఆహారపంపిణీలో భాగంగా ఆహార కొరతతో ఉన్నవారిని గుర్తించి శనివారం వారికి సుమారు 300 ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. డంపింగ్ యార్డు కార్మికుల సమక్షంలో, ఉండ్రాజవరం ఫ్లైఓవర్ సెంటర్‌లో చిన్నారుల వద్ద క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పాటు, ప్రతి ఏటా పైడిపర్రు ఇమ్మానియేలు ప్రార్ధనా మందిరం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈఫీఎఫ్ సంఘ సంఘ వ్యవస్థాపకురాలు పి. అరుణ కుమారి, దైవసేవకురాలు ప్రైజీలు మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక సర్వ మానవాళికి పండుగ రోజన్నారు. చిన్నారులను అక్కున చేర్చుకోవడం, వస్త్రాలు లేనివారిని గుర్తించి సహకారం అందజేయడమే నిజమైన క్రిస్మస్ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఫీఎఫ్ చర్చిసంఘ సభ్యులు, పైడిపర్రు వాసులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీఎస్ఎల్ సీనియర్ మేనేజరు వెనిసెట్టి శివప్రసాద్

తణుకు అర్బన్: తణకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శనివారం వాణిజ్య, ఆర్థిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో బేసిక్స్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్ క్యాపిటల్ మార్కెట్ అండ్ డిపోజిటరీ సర్వీసెస్ అనే అంశంపై జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీఎస్ఎల్ సీనియర్ మేనేజరు వెనిసెట్టి శివప్రసాద్ మాట్లాడుతూ క్యాపిటల్ మార్కెట్‌లో పెట్టుబడి చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెట్టుబడి పెట్టే కంపెనీ గురించి తెలుసుకోవాల్సిన విషయాలను అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీ సుందరి బాయి, వాణిజ్య విభాగాధిపతి వాస్ సత్యకిరణ్, వాణిజ్య, ఆర్థిక శాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం



గుమ్మలూరులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పోడూరు: విద్యుత్ చార్జీల పెంపు దారుణమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ గుమ్మలూరు గ్రామంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు శనివారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యుత్ ఛార్జీలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారాన్ని మోపిందనీ, విద్యుత్ బిల్లులను చెల్లించకుండా ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికలకు ముందు చెప్పిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పూనుకోవడం చాలా దారుణమని వెంకటేశ్వరరావు ఖండించారు. విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిల్లి ప్రసాద్, రాపాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయ రిజర్వేషన్లు సాధించుకోవాలి

పాలకొల్లు అర్బన్: బీసీలు రాజకీయ రిజర్వేషన్లు సాధించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్‌భవాని పిలుపు నిచ్చారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రేవు శ్రీనివాస్ మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా పొశర్ల మాధవ్ ఆదినారాయణను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.